సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 9 । నవంబర్ । 2023

క్లుప్తంగా

సత్తార్ సాహిర్‌కు ఆజాద్ ఉర్దూ అవార్డు


సత్తార్ సాహిర్ ఆజాద్

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ప్రముఖ ఉర్దూ సాహితీ వేత్త ఆచార్య సత్తార్ సాహిర్ ఆజాద్ ఉర్దూ అవార్డుకు ఎంపిక య్యారు. ఈయన తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉర్దూశాఖ అధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు, కవి. ఉర్దూ సాహిత్యం–విద్య, సాంస్కృతిక, విమర్శ, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డును పలు సంవత్సరాలుగా అందజేస్తున్నారు. మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి–జాతీయ విద్యా దినోత్సవ సందర్భంగా ఈ నెల 11న విజయవాడలో ఆయనకు ఆజాద్ అవార్డును సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు. ఈ క్రమంలో రూ.1.50 లక్షల పారితోషికం, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు.

సత్తార్ ఫైజీకి కార్వానే ఉర్దూ అవార్డు

కడపకు చెందిన ప్రముఖ ఉర్దూ కవి సత్తార్‌ఫైజీ కార్వానె ఉర్దూ అవార్డుకు ఎంపిక య్యారని బజ్మే జావీద్ ఉర్దూ సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ అంజద్ అలీ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఖాజాపీర్‌లు తెలిపారు. సీకే దిన్నె మండలం మూలవంక జెడ్పీ హైస్కూలులో ఉర్దూ ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్న ఆయనకు నంద్యాలలోని కార్వానె ఉర్దూ సంస్థ ప్రపంచ ఉర్దూ దినోత్సవ సందర్భంగా ఈనెల 9వ తేదీన ప్రత్యేక సమావేశంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఇందులో భాగంగా ఉర్దూ రతన్ అవార్డు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువతో సంస్థ వ్యవస్థాపకులు అబ్దుల్ అజీజ్ ఆయనను సత్కరించనున్నారు.

ఉర్దూ అధ్యాపకుడికి..


అక్తర్ బాషా

రాయచోటి టౌన్ : జాతీయ ఉత్తమ అధ్యాపకుడిగా తనను ఎంపిక చేసినట్లుగా రాయ చోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫౌరశాస్త్ర అధ్యాకుడు అక్తర్ బాషా తెలిపారు. ప్రతి ఏడాది నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు అవార్డులను ప్రదానం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే తన కు ఉత్తమ జాతీయ అధ్యాపకుడిగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అబుల్ కాలం అజాద్ జయంతి ది నోత్సవం రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు.

మదనపల్లె టీచర్లకు రాష్ట్రస్థాయి పురస్కారాలు


ఖమర్ అమీని


మహమ్మద్‌ఖాన్


సయ్యద్‌హాషిం

మదనపల్లె సిటీ: ఈ నెల 11న మైనారిటీ దినోత్సవం పురస్కరించుకుని ఉర్దూ భాషాభివృద్ధి, మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడుతున్న పలువురికి ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి అవార్డులు ప్రకటించింది. మదనపల్లెకు చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ఉపాధ్యాయులు ఖమర్ అమీనికు మౌల్వీ అబ్దుల్ హఖ్ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని, మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.మహమ్మద్‌ఖాన్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు రూ.25 వేలు నగదు, బాలాజీనగర్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ హాషింకు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో పాటు రూ.10 వేలు నగదును ఇవ్వనున్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

నూతన నియామకం


కుప్పం ప్రసాద్‌రావు

చక్రాయపేట: ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ రాష్ట్ర డైరెక్టర్‌గా కుప్పం ప్రసాద్‌రావు నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలంలోని కె.రాజుపల్లె గ్రామవాసి అయిన ఈయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి విధేయుడిగా ఉన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ప్రసాద్‌రావు భార్య ప్రసూనాంబ ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవినిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వై.ఎస్.భాస్కర్‌రెడ్డి, చక్రాయపేట మండల ఇన్‌చార్జి వై.ఎస్.కొండారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియచేశారు. బ్రహ్మణ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

రేపు తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉప ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అప్రమత్తతే.. ఔషధం

- వాతావరణం మారిన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం
- పరిసరాల శుభ్రత ముఖ్యం
- జాగ్రత్తలు పాటించడం అత్యవసరం


పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు వివరిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాతావరణం మారిన నేపథ్యంలో అప్రమత్తంగా లేకుంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు సీజనల్ వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తుండగా, ఇళ్ల పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం లేకపోవడంతో పాటు వ్యాధులపై అవగాహన లేక రోగాల బారిన పడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉంది. రెండు, మూడు రోజులుగా వర్షాలు ఓ మోస్తరుగా పడుతున్నాయి. మరిన్నిరోజులు కూడా వర్షాలు పడవచ్చని వాతావరణశాఖ సూచించింది. మరోవైపు వాతావరణం మారినందున కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వివిధ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. రోడ్ల పక్కన విక్రయించే ఆహార పదార్థాలను తినకుండా ఉండటం, వర్షంలో తడవకుండా ఉండటం.. వేడినీరు తీసుకోవడం వల్ల వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు వ్యాధులు, నివారణ మార్గాల గురించి అందరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. దోమల నివారణకు ప్రభుత్వం కూడా అనేక చర్యలు చేపడుతోంది.

దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్

వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు సాధారణంగా జలుబు చేస్తుంది. ఆ తర్వాత జ్వరం, దగ్గు, ముక్కు కారడం, ఒంటినొప్పులు వస్తాయి. ఎయిర్ కండీషనర్ వల్ల కూడా జలుబు వచ్చే అవకాశం ఉంది. ఎయిర్ కండీషనర్ ఫిల్టర్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మరోవైపు జలుబు ఎక్కువైతే పిల్లల్లో అస్తమా కూడా రావచ్చు.

అతిసారం

అతిసార అనేది కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. అతిసార సోకితే ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీరు తాపించాలి. తీవ్రమైన అతిసార ఉన్నప్పుడు ద్రవ పదార్థాలు తీసుకోవాలి. రోగికి విశ్రాంతినిస్తే కోలుకునే అవకాశం ఉంటుంది.

టైఫాయిడ్

టైఫాయిడ్ బారిన పడటానికి ప్రధాన కారణం కలుషిత నీరు, ఆహారమని చెప్పవచ్చు. ఇది త్వరగా సంక్రమించే వ్యాధి. దీర్ఘకాల జ్వరం, కడుపులో నొప్పి, తలనొప్పి వస్తే టైఫాయిడ్‌గా పరిగణించాలి. కొంతమందికి శరీరంపై దద్దుర్లు కూడా వస్తాయి. ఈ సమయంలో పిల్లలకు ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి.

▶▶ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా



జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. మరోవైపు పిల్లలకు జ్వరం అధికంగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇది మలేరియా వ్యాధి లక్షణంగా భావించవచ్చు. డెంగీ, చికెన్ గున్యా వ్యాధులతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. చిన్నారుల్లో తలనొప్పి, తుమ్ములు, జ్వరం, వెన్నునొప్పి, శరీరంపై పొక్కులు రావడం, కాళ్లు, కీళ్లలో నొప్పి ఉండటం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

కామెర్లు

కాలేయానికి ఇన్‌ఫెక్షన్ రావడమనేది వర్షాకాలంలో సర్వసాధారణం. ఈ వ్యాధి కలుషిత నీటి వల్ల సోకుతుంది. మరోవైపు హెపటైటిస్ వైరస్ వల్ల కూడా ఈ వ్యాధి వ్యాపించే ప్రమాముంది. మూత్రం పసుపు పచ్చగా రావడం, కళ్లు సైతం పసుపు వర్ణంలోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.

చర్మ సమస్యలు

ఫంగస్ బ్యాక్టీరియా కారణంగా చర్మవ్యాధులు వస్తాయి. ఈ సమస్యలు రాకుండా చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. రాత్రి వేళల్లో కోల్డ్ క్రీములు రాసుకుంటే మంచిది.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఈ ప్రభావం అధికం. వర్షంలో తడిస్తే జలుబుతో పాటు నిమోనియా వచ్చే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బయట చిరుతిండ్లు మానేయాలి. రోజూ నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలి. – డాక్టర్ కరుణాకర్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, రిమ్స్, కడప

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ముఖ్యంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు లేకుండా చూసుకోవాలి. రోజూ నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలి. వర్షకాలంలో అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, వైద్య నిపుణులు, అర్బన్ హెల్త్ సెంటర్, కడప

సీజనల్ వ్యాధులపై జాగరూకత అవసరం


నిమ్మనపల్లె పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న వేణుగోపాల్

నిమ్మనపల్లె: సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నమయ్య జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ రమేష్‌బాబును అడిగి ఫీవర్ సర్వే, రోగుల వివరాలు తదితర విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయనతో కలిసి బండ్లపై గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన అబేట్ పిచికారి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా జ్వరాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని, వ్యర్థపదార్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. జ్వర లక్షణాలు కలిగినవారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రక్తపరీక్షలు చేసుకుని వ్యాధి నిర్ధారణ తరువాత వైద్యం పొందాలన్నారు. వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా ఫీవర్ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖలీల్, సూపర్‌వైజర్ దేవేంద్ర, ఎఎన్ఎం అబీదా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం.. అందాలన్నదే నినాదం

- నేడు న్యాయసేవల దినోత్సవం
- కడపలోని జిల్లా కోర్టులో మీటింగ్, ర్యాలీ



కడప అర్బన్: బలహీన వర్గాలకు దేశ వ్యాప్తంగా ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవలు అందించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోంది. జిల్లాలో గ్రామాలను దత్తత తీసుకుని రెవెన్యూ డిపార్ట్‌మెంట్, లేబర్, మహిళా శిశుసంక్షేమాభివృద్ధి, ట్రైబర్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఫిర్యాదులు లేకుండా చేయాలని లక్ష్యంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. దేశ వ్యాప్తంగా నవంబర్ 9న ప్రజలకు న్యాయం జరగాలన్నదే మా లక్ష్యం నినాదంతో 'న్యాయ సేవల దినోత్సవం(లీగల్ సర్వీసెస్ డే)' జరుపుకొంటున్నారు. ఈ నెల 9న (గురువారం) జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'ఐవిఆర్ఎస్ టెక్నాలజీ' ద్వారా నేషనల్ టోల్‌ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ప్రారంభించనున్నారు. ఎన్‌సీ డబ్ల్యూ మొబైల్ అప్లికేషన్ 'హెర్ లీగల్ గైడ్'సీ వర్చువల్ మోడ్ ద్వారా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, డిఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ ఎం. ప్రదీప్‌కుమార్, సిబ్బందితో కలిసి ఉదయం 9:15 గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం ర్యాలీ నిర్వహించనున్నారు.

సేవలందించడమే ధ్యేయం

జిల్లా న్యాయసేవాధికా సంస్థ సేవలందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. మండల న్యాయ సేవా సమితి న్యాయ విజ్ఞాన సదస్సులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ విధి విధానాలను, ఇంటింటి న్యాయ ప్రచారాలు, స్కూల్స్, కాలేజీలలో 'లీగల్ లిటరసీ'క్లబ్స్ ఏర్పాటు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన, షెల్టర్ హోమ్‌లు, ఓల్డ్ ఏజ్ హోమ్‌లు, చిల్డ్రన్ హోమ్‌లు, వెల్ఫేర్ హాస్టల్‌లు పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తున్నారు. కడప న్యాయసేవాధికార సంస్థ 2022 నవంబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు 467 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడమేగాక, 119 మందికి ఉచిత న్యాయ సహాయం అందించింది. నాలుగు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 53500 కేసులు, మూడు ప్రత్యేక లోక్ అదాలత్‌ల ద్వారా 103 కేసులు రాజీ చేయగలిగారు. మహిళలు, వికలాంగులు, షెడ్యూల్ తెగలు, పిల్లలు, షెడ్యూల్ కులాలు, మానవ అక్రమ రవాణా బాధితులు.. అలాగే ప్రకృతి వైపరీత్యాల బాధితులైన బలహీన వర్గాలకు ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవలను అందించారు.

శ్రీవాణి..ఆధ్యాత్మిక బాణీ

- అన్నమయ్య జిల్లాలో 172 ఆలయాల జీర్ణోద్ధరణ
- నూతన దేవాలయాల నిర్మాణానికి నిధులు
- ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసిన టీటీడీ
- ఈ నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో దేవాలయాల నిర్మాణం



నియోజకవర్గం	శ్రీవాణి ట్రస్టుకు ఎంపికైన దేవాలయాలు
రాయచోటి	54
రైల్వేకోడూరు	40
రాజంపేట	48
పీలేరు	8
తంబళ్లపల్లె	13
మదనపల్లె	9

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. ఆయా కాలనీల్లో నూతన ఆలయాల నిర్మాణం, పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు తిరుమల, తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా భారీగా నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లాలో 172 ఆలయాలకు మొత్తం రూ.1.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలో పలు ఆలయాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. హిందూ ధర్మ ప్రచారం, దేవాలయాల నిర్మాణం, పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్టు ద్వారా భారీ నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రామాలయం, శివాలయం, నరసింహ స్వామి దేవస్థానం, గ్రామదేవతల ఆలయాలను నిర్మించుకునేందుకు, అలాగే ఎక్కడైనా పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరి ఉంటే వాటి జీర్ణోద్ధరణకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేస్తోంది. కనీసం రూ.10 లక్షలకు తక్కువ కాకుండా నిధులు అందిస్తోంది. వీటితో పాటు గ్రామస్తులు, దాతల సహకారం ఇతరత్రా మార్గాల్లో పెద్ద ఎత్తున దేవాలయాలను నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్టు కృషి చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో 172 ఆలయాలకు ఒక్కొక్క దేవాలయానికి రూ.10లక్షలు చొప్పున రూ.1.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాల పనులు వివిధ దశలో జరుగుతున్నాయి. జిల్లాలో 172 ఆలయాల్లో ఫేస్–1లో 57 దేవాలయాలు మంజూరు కాగా, అందులో 4 దేవాలయాలు పూర్తి చేశారు. మిగిలిన 53 ఆలయాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఫేస్–2లో 61 దేవాలయాలు మంజూరు కాగా, 6 దేవాలయాల నిర్మాణ పనులు పూర్తికాగా మిగిలిన 55 ఆలయాల పనులు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఫేస్–3లో 54 దేవాలయాలు మంజూరుకాగా వివివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి.

అధ్యాత్మికతను పెంపొందించేందుకు..



ప్రజల్లో అధ్యాత్మికతను పెంపొందించేందుకు ఆలయాల నిర్మాణం, పురాతన దేవస్థానాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా జిల్లాలో 172 ఆలయాలకు నిధులు మంజూరు చేయడం సంతోషకరం. టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. –విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ, రాయచోటి

ఎల్ఎల్‌బీ, ఫైన్ ఆర్ట్స్ పరీక్ష ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్ఎల్‌బీ మూడేళ్లు, ఐదేళ్ల కోర్సు సెమిస్టర్ పరీక్షల ఫలితాలతో పాటు బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పరీక్షా ఫలితాలు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ బుధవారం విడుదల చేశారు. వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డితో కలిసి పరీక్షా ఫలితాలపై చర్చించారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను త్వరితగతిన విడుదల చేయడం అభినందనీయమన్నారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 2వ సెమిస్టర్‌లో 339 మంది హాజరు కాగా 190 మంది (56.05 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 6వ సెమిస్టర్ పరీక్షలకు 72 మంది హాజరు కాగా 40 మంది (55.56 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. 8వ సెమిస్టర్‌లో 111 మంది హాజరు కాగా 78 మంది (70.27 శాతం) పాసయ్యారని వివరించారు. 10వ సెమిస్టర్‌లో 126 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 106 మంది (84.13 శాతం) ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ 2,4,6 సెమిస్టర్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి డా.సుమిత్ర పాల్గొన్నారు.

బాలికల్లో కృష్ణా, బాలురలో చిత్తూరు జట్లకు ప్రథమస్థానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 67వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–19 అంతర్ జిల్లాల బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్స్‌లో బాలికల విభాగంలో కృష్ణాజిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానం, కడప జట్టు తృతీయ స్థానం పొందాయి. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు ప్రథమ, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయ, కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

ప్రయాణికుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి



బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఈడీ

తిరుపతి అర్బన్: ప్రయాణికుల ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన బుధవారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 10 నుంచి 15 ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిలో 90 శాతం మరుగుదొడ్ల దోపిడీపైనే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించిన మరుగుదొడ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. కార్గోలో పార్శల్ బుకింగ్ చేసుకున్న వారికి ప్రతి మంగళవారమూ లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేయాలని తెలిపారు. బస్టాండ్‌లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని వెల్లడించారు. విద్యుత్ బస్సులను సమర్థవంతంగా నడిపించాలని తెలిపారు. తిరుమల ఘాట్ రోడ్డులో నడుస్తున్న సర్వీసులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని సూచించారు. డెప్యూటీ సీటీఎం భాస్కరెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఎం బాలాజీ, సత్యనారాయణ, ఆవుల ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దీపం.. భిన్నం

- వెలుగుల పండుగకు ప్రత్యేకం
- ఆకట్టుకునే ఆకృతులు
- వెలసిన దివ్వెల దుకాణాలు
- మొదలైన కొనుగోళ్లు




దివ్వెలను కొనుగోలు చేస్తున్న మహిళలు

రాజంపేట టౌన్: చెడుపై మంచి సాధించిన గెలుపుకు చిహ్నంగా జరుపుకునే దీపావళి పండుగ మరికొన్ని రోజుల్లోనే రాబోతోంది. ఒకప్పుడు దీపావళి పండుగకు ప్రజలు టపాసులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ప్రజల అభిరుచుల్లో, ఆలోచనా ధోరణిలో గణనీయమైన మార్పు వచ్చింది. దీనికి తోడు ప్రజల్లోను చైతన్యం వచ్చింది. అందువల్ల ప్రజలు దీపావళి రోజున మాత్రమే కొద్దో గొప్పో టపాసులు కాలుస్తున్నారు. అయితే అనేక మంది కాలుష్య రహిత సమాజం కోసం టపాసులకు దూరంగా ఉండేవారు ఉన్నారు. అలాంటి వారు తమ ఇళ్ల ముంగిట దీపాలను వెలిగించి పండుగను జరుపుకుంటున్నారు.

మారిన ట్రెండ్

ఒకప్పుడు దీపావళి పండుగ, కార్తీక మాసం సందర్భంగా మహిళలు చిన్న ప్రమిదల్లో దీపాలను వెలిగించేవారు. అయితే కాలానికి అనుగుణంగా చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఇప్పుడు అనేక వెరైటీల్లో దివ్వెలు అందుబాటులోకి వచ్చాయి. ఏడాదికేడాది కొత్త రకమైన దివ్వెలు మార్కెట్‌లోకి వచ్చి మహిళలను ఆకర్షిస్తున్నాయి. దీంతో మహిళలు సైతం వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కారణంగా వ్యాపారులు కూడా సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికత, సాంకేతికతను కలబోస్తూ నేటి తరానికి నచ్చే రీతిలో అనేక డిజైన్లలో దీపాలను అందుబాటులోకి తెచ్చారు. దీపావళి సమీపిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా దివ్వెల దుకాణాలు వెలిశాయి. పండుగకు ముందు రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని అనేక మంది ఇప్పటి నుంచే దివ్వెలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. దీంతో గత మూడు రోజులుగా వ్యాపారం కూడా ఊపందుకుందని వ్యాపారులు చెబుతున్నారు.

▶▶ స్టేటస్ సింబల్‌గానూ..



ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలు తమ అభిరుచి మేరకు గృహాలను నిర్మించుకుంటున్నారు. ఇందుకోసం ఒక గృహానికి కోటి రూపాయిలకు పైగా ఖర్చు చేస్తున్న వారు సైతం లేక పోలేదు. అలా ఆధునికతతో ఖరీదైన గృహాలు నిర్మించుకున్న వారు దీపావళి సందర్భంగా తమ ఇంటి లోగిళ్లలో అందమైన దివ్వెలతో దీపాలు వెలిగించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అందువల్ల ధర ఎక్కువైనా లేటెస్ట్ మోడల్ దివ్వెలతో పాటు విద్యుత్ కాంతులతో కనువిందు చేసే దివ్వెలను కొనుగోలు చేస్తున్నారు. 10 రూపాయల నుంచి 350 రూపాయల వరకు దివ్వెలు అందుబాటులో ఉన్నాయి.

కొత్తదనానికి పెద్దపీట



ప్రజలు దీపావళి పండుగ రోజే కాకుండా పండుగ మరుసటి రోజు నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకొని దివ్వెలు కొనుగోలు చేస్తున్నారు. ప్రజల అభిరుచికి తగ్గట్లు ప్రతి ఏడాది వివిధ మోడల్స్‌లో దివ్వెలను తెప్పిస్తున్నాము.

– శ్రీనివాసులు, దివ్వెల వ్యాపారి, రాజంపేట

సురేష్‌కు సీపీ బ్రౌన్ పురస్కారం


సురేష్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త మొగలిచెండు సురేష్‌ను గుడివాడలో బుధవారం సీపీ బ్రౌన్ పురస్కారంతో సత్కరించారు. సీపీ బ్రౌన్ జయంతి సందర్భంగా స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జి.బాబూశ్రీకర్, గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ, డీఆర్‌బీ ప్రసాద్, ఎంవీజే ఆంజనేయులు, ఎ.వెంకటేశ్వరరావు, కె.గాంధీబాబు, ఎం.వెంకట్రావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



'జగనే మా నమ్మకం..'

ఆపు బాబు నీ నాటకం... జగనే మా నమ్మకం నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పిలుపునిచ్చారు. -IVలో



ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

సిద్దవటం రేంజ్‌లో ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు. -IVలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.1/24.8

జిల్లాలో బుధవారం 24.8 – 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో పలుచోట్ల వర్షం

కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. కమలాపురంలో అత్యధికంగా 19.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే గోపవరంలో 10.2 మి.మీ, బికోడూరులో 8.2 , బద్వేల్‌లో 7.2, పోరుమామిళ్ల, అట్లూరులలో 5.2 , చెన్నూరులలో 2.8 , ఒంటిమిట్టలో 1.6 , బిమఠంలో 1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

14న అప్రెంటిస్ మేళా

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ కమ్ రోజ్‌గార్ మేళా ఈ నెల 14న కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నప్ప తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు 10వ తరగతి , ఐటీఐ మార్కుల జాబిత, ఐటీఐ ఎన్‌టిసి సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణపత్రం, బ్యాంకు అకౌంట్ పుస్తకం, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో హాజరుకావాలన్నారు. అప్రెంటిస్‌లో చేరిన వారికి నెలకు రూ. 8050 చెల్లిస్తారని పేర్కొన్నారు. మేళాలో వివిధ కంపెనీల్లో పాల్గొని వారికి కావాల్సిన ట్రేడ్ విద్యార్థులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులంతా ఈ మేళాకు హాజరుకావాలని తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని రిమ్స్ సమీపంలోని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పిఎంకేవీవై)4 పథకం ద్వారా 10వ తగరతి పాస్ అయిన నిరుద్యోగ యువతి, యువకులకు మూడు నెలల స్వల్పకాలిక శిక్షణ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు మైనార్టీ గవర్నమెంట్ ఐటీఐ ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డొమెస్టిక్ ఎలక్ట్రిక్ సొల్యూషన్స్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, టూవీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, మొయిల్ ఐడీ ఫోన్ నెంబర్ తీసుకుని నేరుగా ఐటీఐకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా విలువైన సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. అర్హత,ఆసక్తి కల్గిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాన్ని పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: ఆల్ ఇండియా సైనిక పాఠశాలల ప్రవేశ పరీక్ష (ఏఐఎస్‌ఎస్ఈఈ)-2024 కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) ఒక ప్రకటనలో పేర్కొంది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 9వ తరగతులలో ప్రవేశాలకు వచ్చే ఏడాది జనవరి 21న పరీక్ష జరుగుతుందని, 6వ తరగతిలో ప్రవేశానికి 31-03-2024 నాటికి అభ్యర్థులు 10 నుంచి 12సం.లు లోపు వయస్సు, 9వ తరగతిలో ప్రవేశానికి 13 నుంచి 15సం.లోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబరు 16లోపు ఆన్‌లైన్‌లో ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, జనరల్/ఓబీసీ/డిఫెన్స్ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో తెలిపారు.

28న విజ్ఞానమేళా

రామాపురం: కలామ్స్ విజన్ 2023 విజ్ఞానమేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. ఈ నెల 28, 29 రాయచోటిలోని ఇంటర్నేషనల్ మెరిట్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పేర్లు నమోదుకు 6281453550 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం వైస్ ప్రిన్సిపల్ అఫ్రోజ్‌బేగం కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, మునిరా, నరేష్ పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ తరగతులు

సంబేపల్లి: మండలంలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీలోని ఆర్‌బీకేలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు అన్నమయ్య జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ హాజరై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

పల్లెలకూ ఫైబర్‌నెట్

మదనపల్లె: జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ సేవలను భాగస్వామ్యపద్ధతి(ఫ్రాంచైజ్) ద్వారా రాయితీతో అందిస్తున్నామని జీఎం అమరేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జీఎం మాట్లాడారు. భారత ప్రభుత్వ సహకారంతో జిల్లావ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ స్యాచురేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 113 4జీ టవర్స్ ఏర్పాటుతో సేవలను మారుమూల గ్రామాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఫైబర్‌నెట్ సేవలు 650 పంచాయతీల్లో అందిస్తున్నామని, 30,000కు పైగా కనెక్షన్లు కలిగి ఉన్నట్లు చెప్పారు.డీజీఎం వెంకోబరావు పాల్గొన్నారు.

సామాజిక స్వప్నం సాకారం

- రాజకీయ ప్రాధాన్యత పోస్టుల్లో 50 శాతం బడుగులకే
- సంక్షేమ పథకాలతో ఆర్థికంగా వెన్నుదన్ను
- రేపు తంబళ్లపల్లె నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర



బి.కొత్తకోట: దశాబ్దాలుగా నేతల మాటలకే పరిమితమైన సామాజిక స్వప్నం వైఎస్ఆర్ సీపీ పాలనలో సాకారమైంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నవ శకం మొదలైంది. గత పాలకులు, ముఖ్యంగా గత టీడీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా ఓటు బ్యాంకుగా మలుచుకుందే తప్పా.. రాజకీయంగా, సంక్షేమం పరంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీలకు సముచిత గౌరవం ఇచ్చింది లేదు. వారి సమస్యలపై మూగరోదన తప్ప ఫలితం లేదు. అలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి అన్ని రంగాల్లో గౌరవం ఇచ్చి, వారి ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు.

- వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక బడుగు వర్గాలకు జరిగిన మేలును వివరిస్తూ 'సామాజిక సాధికార బస్సు యాత్ర'గా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 10న తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మండల కేంద్రం పెద్దతిప్పసముద్రం నుంచి మండల కేంద్రం ములకలచెరువు వరకు బస్సు యాత్ర సాగనుంది. ఈ యాత్ర ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభు త్వం కలిగిన ప్రయోజనం, ఆర్థిక అండ, రాజకీయంగా లభించిన ప్రాధాన్యతగురించి వివరిస్తారు.

ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా..

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని కులాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక కార్పొరేషన్లు, వాటికి చైర్మన్లు, డైరెక్టర్లుగా ఆయా సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించారు.

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పార్టీ, ప్రభుత్వ పదవుల్లో సముచిత ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఇద్దరి నుంచి కనీసం నలుగురు వివిధ పదవుల్లో నియమితులయ్యారు.
- మదనపల్లె ఎమ్మెల్యేగా నవాజ్‌బాషాకు అవకాశం కల్పించారు. జి.షమీం అస్లాంకు ఏపీఎండీసీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. రాయచోటికి చెందిన జకియా ఖానం శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్నారు.
- తంబళ్లపల్లె, రాజంపేట, వాయల్పాడు మార్కెట్ కమిటీలకు బీసీ వర్గాలకు చెందిన మహిళలను చైర్మన్లుగా చేశారు.

తంబళ్లపల్లెలో 50శాతానికి మించి..

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇచ్చారు. సర్పంచు, ఎంపీటీసీ, వార్డు మెంబర్లను వారి రిజర్వ్ స్థానాల్లోనే కాకుండా జనరల్ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేయించి గెలిపించుకున్నారు. ఈ విధంగా స్వాతంత్య్ర చరిత్రలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో మొదటిసారి జరిగింది.

జగన్‌తోనే సాధ్యం



సామాజిక న్యాయం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం. ఆయన మాటల మనిషి కాదు చేతల మనిషి. గత ప్రభుత్వాలు ఈ వర్గాలను మాటలతో మభ్యపెట్టి రాజకీయంగా లబ్ధి పొందారు. ప్రస్తుతం ఈ వర్గాలకు రాజకీయంగా అధికారం దక్కింది. కార్పొరేషన్లు, స్థానిక సంస్థల పదవులేకాక మంత్రి మండలిలోనూ ప్రాధాన్యత కల్పించిన జగన్ ఈ వర్గాలు అండగా నిలవాలి. –మిథున్‌రెడ్డి, ఎంపీ

▶▶ రేపటి యాత్ర వివరాలు

తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం ,ములకలచెరువు మండలాల్లో శుక్రవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర ఉదయం 11 గంటలకు మండల కేంద్రం పెద్దతిప్పసముద్రం నుంచి ప్రారంభం అవుతుంది. కుమ్మరపల్లె, మద్దయ్యగారిపల్లె, కమ్మోరుపల్లె, పులికల్లులో యాత్రకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రం ములకలచెరువు చేరుకుంటారు. ఇక్కడి మూడు రోడ్ల కూడలిలో జరిగే బహిరంగ సభలో నేతలు ప్రసంగిస్తారు. ఈ సభకు భారీసంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారు.

▶▶ హాజరయ్యే ప్రజాప్రతినిధులు

ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపురంజిల్లాలకు చెందిన మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీలు మిథున్‌రెడ్డి, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, హాఫీజ్‌ఖాన్ (కర్నూలు), శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి), ఎమ్మెల్సీ కుంభ రవిబాబు తదితరులు హాజరవుతున్నారు.

▶▶ నభూతో నభవిష్యత్ అన్నట్టు..



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గతంలో, భవిష్యత్తులో ఎన్నడూ జరగని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం జరిగింది. జిల్లాలో జగనన్న చేదోడు పథకం ద్వారా 2020-21 నుంచి 2023-24 వరకు టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు 45,922 మందికి రూ.45.92 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది. వైఎస్ఆర్ కాపునేస్తం పథకం ద్వారా 2020-21 నుంచి 2023-24 వరకు 38,821 మందికి రూ.58.23 కోట్లు అందించారు. ఈబీసీ నేస్తం పథకం ద్వారా బీసీ వర్గాలకు 2021-22 నుంచి 2022-23 వరకు 45,985 మందికి రూ.68.98 కోట్లు అందించారు. స్వయం ఉపాధి పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 2020-21లో 171 మందికి 9.93 కోట్ల ఆర్థిక సాయం అందజేసింది. 2019-20 నుంచి 2022-23 వరకు జిల్లాలో జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 1,06,933 మంది విద్యార్థులకు రూ.121.44 కోట్లు, జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 2,25,969 మంది విద్యార్థులకు రూ.154.16 కోట్లను అందించారు. ఇవిగాక ప్రతిపథకంలోనూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దసంఖ్యలో లబ్ధి చేకూరింది.

▶▶ 55,878 గృహాలు వీళ్లకే

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇంటిస్థలాలు, పక్కా గృహాల మంజూరులో అధిక ప్రాధాన్యత ఇచ్చింది ప్రభుత్వం. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 73,069 గృహాలు మంజూరు చేయగా అందులో 55,878 గృహాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే మంజూరు చేశారు. ఎస్సీలకు 11,144, ఎస్టీలకు 3,016, బీసీలకు 34,981, మైనార్టీలకు 6,737 గృహాలను మంజూరు చేశారు. అలాగే వీటి నిర్మాణాల కోసం ఇప్పటివరకు ఎస్సీ గృహాలకు రూ.116.52 కోట్లు, ఎస్టీ గృహాలకు రూ.31.59 కోట్లు, బీసీ గృహాలకు రూ.335.33 కోట్లు, మైనార్టీ గృహాలకు రూ.63.15 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

సీఎం స్ఫూర్తితో..



బడుగు, బలహీన, దళితవర్గాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆచరిస్తున్న మార్గాన్ని అనుసరిస్తున్నా. తంబళ్లపల్లె నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లతో సంబంధం లేకుండా బీసీలకు 50శాతం స్థానాల్లో పోటీ చేయించి గెలిపించుకున్నాం. ఇది జగన్ స్ఫూర్తితో సాధ్యమైంది. అన్ని వర్గాల సంక్షేమాన్ని గతంలో ఏ ప్రభుత్వం ఆశించలేదు. ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమం చరిత్రలో నిలిచిపోతుంది. –పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

▶▶ భారీగా సభ..

ములకలచెరువులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు భారీసంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. గత ఏ ప్రభుత్వ హయాంలోనూ లబ్ధి చేకూరలేదు. ఏ పథకం కావాలన్న ఏళ్ల తరబడి ఎదురుచూడటం, స్థానిక నేతలు దయతలిస్తేనే మంజూరు లభించేది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేకపోవడం, ఇంటి తలుపుతట్టి పథకాలు అందిస్తుండటంతో బడుగు, బలహీన, మైనార్టీ, దళిత వర్గాలు సభకు భారీగా తరలిరానున్నారు. ములకలచెరువు మూడురోడ్ల కూడలిలో జరిగే సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారు.

నేటి నుంచి సీఎం పర్యటన

కడప సెవెన్‌రోడ్స్/పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నుంచి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించనున్నారు. రెండు రోజుల తన పర్యటనలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో పాటు శంకుస్థాపనలూ చేయనున్నారు. అలాగే పలువురి నేతల వివాహ వేడుకలు, బంధువుల పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఇరు జిల్లాల కలెక్టర్లు, నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీల ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు బిజీబిజీగా సీఎం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా పులివెందుల పట్టణంలోని పలు ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడపనున్నారు. గురువారం మధ్యాహ్నం పులివెందులకు చేరుకోనున్న ముఖ్యమంత్రి భాకరాపురం రింగురోడ్డు సర్కిల్‌లో ఇటీవల దేవదాయశాఖ నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని మందిరాన్ని ప్రారంభించనున్నారు. దీంతో పాటు పలు అభివృద్ధి పనుల్లో పాల్గొననున్నారు.


సి.వి.సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల పరామర్శ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమీప బంధువు వరుసకు తాత అయిన సి.వి.సుబ్బారెడ్డి ఇటీవల వృద్ధాప్యంతో మృతిచెందారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబకపల్లె రోడ్డులో గల సి.వి.సుబ్బారెడ్డి స్వగృహానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.



సీఎం పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందుల పర్యటన నేపథ్యంలో ఆయన పర్యటనకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో ఒక అడిషనల్ ఎస్పీ, 9 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 53 మంది ఎస్సైలు, 197 మంది ఏఎస్సైలు, 389 మంది కానిస్టేబుల్స్, 31 మంది మహిళా పోలీసులు, 198 మంది హోంగార్డులు సీఎం పర్యటన సందర్భంగా పలు ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ముఖ్యమంత్రి ప్రారంభించనున్న శ్రీకృష్ణుని మందిరం

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం జేసీ గణేష్‌కుమార్‌తో కలిసి పర్యటన ప్రాంతాలను పరిశీలించారు. సీఎం పర్యటనలో ఉన్న అధికారులందరు విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్, రెవిన్యూ, ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

▶▶ పర్యటన ఇలా...



సీఎం జగన్ గురువారం ఉదయం 11.15 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా రాయచోటి సమీపంలోని సుద్ద లవాండ్లపల్లెకు బయలుదేరుతారు.

- అక్కడ నాయకులతో ముచ్చటించి మధ్యాహ్నం 12.05 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 12.10 గంటలకు రాయచోటి అభి కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు.
- 12.25 గంటల వరకు అక్కడ జరిగే శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొంటారు.
- 12.25 బయలుదేరి 12.30 గంటలకు రాయచోటిలోని రాజధాని ఫంక్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ మాజీ ఎంపీపీ కుటుంబ వివాహ వేడుకల్లో పాల్గొంటారు.
- 1.00 గంటకు హెలికాప్టర్‌లో బయలుదేరి 1.30 గంటలకు భాకరాపురం చేరుకుంటారు.
- శ్రీకృష్ణ ఆలయానికి 1.40 గంటలకు చేరుకుంటారు. 1.55 గంటల వరకు అక్కడే గడుపుతారు. అనంతరం అక్కడి నుంచి 2 గంటలకు శిల్పారామం చేరుకుంటారు.
- శిల్పారామ ప్రారంభోత్సవం అనంతరం 2.35 గంటలకు శ్రీ స్వామి నారాయణ గురుకుల పాఠశాలకు చేరుకుంటారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.
- 2.50 గంటలకు వ్యవసాయ, ఉద్యాన కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 3.15 గంటలకు ఏపీ కార్ల్ రెండవ అంతస్తులోని స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ ల్యాబొరేటరీ వద్దకు చేరుకుంటారు.
- 3.15 నుంచి 3.25 గంటల వరకు స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ ల్యాబొరేటరీకి ప్రారంభోత్సవం చేస్తారు.
- 3.25 నుంచి 3.35 గంటల వరకు అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు.
- 3.40 గంటలకు ఏపీ కార్ల్‌లోని ఆదిత్య బిర్లా యూనిట్ వద్దకు చేరుకుంటారు. 3.55 గంటల వరకు యూనిట్‌ను పరిశీలిస్తారు.
- 4.05 గంటలకు పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలుసమీపంలోని సీవీ సుబ్బారెడ్డి గృహానికి చేరుకుని.. 4.15 గంటల వరకు గడుపుతారు. 4.25 గంటలకు భాకరాపురం నుంచి హెలికాప్టర్‌లో ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో కాసేపు ముచ్చటిస్తారు. అనంతరం ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

10వ తేది ..

- 8.55 గంటలకు ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ పోలీసుస్టేషన్, జమ్మలమడుగు పోలీసుస్టేషన్లను ప్రారంభిస్తారు.
- 9 గంటలకు ఎకో పార్కు వద్ద వేముల మండల నాయకులు, ప్రజలతో సమావేశమవుతారు.
- తిరిగి 11.35 కు గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు.
- 11.50 గంటలకు హెలికాప్టర్ కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.25 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

జనరల్ బోగీల జాడేదీ ?

దూరాభారం ప్రయాణం చేయాలంటే పేదలకు ముందుగా గుర్తొచ్చేది రైలు బండే. చవకగా ఉండే చార్జీలతో పాటు అందులోని సౌకర్యాలే కారణం. ఇదంతా గతం.. ఇప్పుడు రైలు బండి ప్రయాణం పెద్ద గుదిబండగా మారింది. ముఖ్యంగా జనరల్ బోగీల జాడ కరువవడంతో పేద తరగతి ప్రజలకు రైలు ప్రయాణం మరింత ప్రియమైంది.

రాజంపేట: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని రైళ్ల ఫార్మిసిన్(రైలు బండి బోగీల వరుస క్రమం) లో జనరల్‌కోచ్‌లు తగ్గించివేశారనే ఆరోపణలు పేద వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు వాటి జాడ కనుక్కొనేందుకు పేదప్రయాణికులు ప్లాట్‌ఫాంపై ఉరుకులు, పరుగులు తీస్తూ ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

మచ్చుకు..

తిరుపతి-నిజామబాద్ మధ్య నడిచే రాయలసీమ, వెంకటాద్రి, చెన్నై-ముంబాయి మధ్య నడిచే దాదర్, జయంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇదివరకు రెండు, లేదా మూడు జనరల్ బోగీలు ఉండేవి. ఇప్పుడు రెండు కాదు కదా సింగల్ జనరల్ బోగీనే అందుబాటులో ఉంటోంది. దాదాపు అన్ని రైళ్లలో నూ ఇదే పరిస్థితి ఉంది. పైగా ఇప్పుడు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, స్లీపర్ కోచ్‌లే అధికంగా కనిపిస్తున్నాయి. ఈ ఏసీలో త్రిటైర్ వివిధ శ్రేణులు కోచ్‌లు ఉంటాయి. ఫార్మసీన్‌లో జనరల్ బోగీలు కనిపించక సాధారణ ప్రయాణికులు రైలెక్కడానికి ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితిలో ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలో 25 స్టేషన్లు ఉండగా, డైలీ 30 (అప్ అండ్ డౌన్) రైళ్లు నడుస్తున్నాయి. అసలే పేదవర్గాల ప్రయాణించే ప్యాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లగా మార్చి పట్టాలెక్కిస్తున్న రైల్వే శాఖ .. జనరల్ బోగీలు కూడా తగ్గించి పేదలను రైలు ప్రయాణం నుంచి దూరం చేస్తోందనే విమర్శ మేధావి వర్గాల నుంచి వినిపిస్తోంది.



రైలు జనరల్ బోగీ

మిలటరీ కోచ్‌లకు మంగళం..


దేశ ప్రధాని మోదీ పాలనలో వివిధ రైళ్లలో మిలటరీ కోచ్‌లకూ మంగళం పాడారు. ఒకప్పుడు ముంబై-చెన్నై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, బైవీక్లీ, స్పెషల్‌ట్రైన్స్‌లో సైతం మిలటరీ కోచ్‌లు ఉండేవి. అవి ఇప్పుడు ఏ రైళ్లలోను కూడా కనిపించడంలేదు. ఎన్‌డీఏ సర్కారు దేశసైనికులకు ఇచ్చే గౌరవమిదేనా అని మాజీ సైనికులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం మిలటరీ కోచ్‌లను ఎక్స్‌ప్రెస్ ఫార్మసిన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళతాం..



పేద, మధ్యతరగతి ప్రజలు రిజర్వేషన్లు దొరకక ఎక్కువగా జనరల్ బోగీలోనే ప్రయాణాలు చేస్తున్నారు. ఈ సమస్యపై గుంతకల్లు రైల్వే వినియోగదారుల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. రైల్వే శాఖ జనరల్ బోగీల సంఖ్య పెంచాలి. – తల్లెం భరత్ కుమార్ రెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్

జనరల్ బోగీల సంఖ్యను పెంచాలి



జిల్లా మీదుగా నడిచే రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలి. ఉన్న జనరల్‌బోగీలు ప్రారంభం నుంచే కిటకిటలాడుతూ వస్తోంది. మార్గ మధ్యంలో వివిధ రైల్వేస్టేషన్లలో జనరల్‌బోగీలో ఎక్కేందుకు వీలు లేకుండా పోయింది. – నరసింహారెడ్డి, ఆర్టీసీ మాజీ ఉద్యోగి, నందలూరు

వెనుకబడిన పిల్లలపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం ప్రతి పాఠశాలలో అమలు చేసి వెనుకబడిన పిల్లల అభ్యసన స్థాయిని పెంపొందించాల్సిన అవశ్యకత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి అన్నారు. పిల్లలలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమంలో బాగంగా బుధవారం కడపలో కాంప్లెక్ స్థాయి రీసోర్సుపర్సన్స్‌కి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతేడాది నవంబర్ నుంచి 10 జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. దీనిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు టీచర్లకు మరోసారి ట్రెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలలో చదవడం, రాయడం, అర్థ చేసుకోసుకోవడం, సంఖ్యా భావనలు అందరికి వచ్చేట్టుగా చేయడం సొంత వాక్యాల నిర్మాణం, సృజనాత్మకత మొదలైన వాటిని సాధించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. స్టేట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చౌక బియ్యం పట్టివేత

చాపాడు : ప్రొద్దుటూరుకు చెందిన టాటాఏస్ వాహనంలో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు తీసుకెళ్తున్న 74 బస్తాల చౌక బియ్యాన్ని బుధవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. కడప విజిలెన్స్ సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి టాటా ఏస్ వాహనం పట్టుకున్నారని, బియ్యం ఆర్‌ఐ ప్రమీలకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ఓబులవారిపల్లె : పొలం పనులకు వెళ్లిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పత్తూరి వెంకట సుబ్బయ్య (35) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. మంగళంపల్లె పంచాయతీలో సుబ్బయ్య ఉదయం అల్పాహారం తినకుండా పనుల వద్దకు వెళ్లారు. అనంతరం విశ్రాంతి తీసుకుందామని కూర్చుని గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సుబ్బయ్య మృతదేహాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించారు. ఆయనతోపాటు ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మీ, ముక్కా సాయివికాష్‌రెడ్డి, ఉపాధి కూలీలు, తదితరులు నివాళులర్పించారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి..



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని జీఈ వార్డులో చేరిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం వార్డులోనే మృతి చెందాడు. ఆస్పత్రి సమీపంలో పాత సామాన్ల దుకాణంలో అతడు పనిచేశారని, కొర్రపాడు రోడ్డులోని ఎర్రన్న కొట్టాలలో అతడు నివాసమున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆచూకీ తెలిస్తే మృతుడి కుటుంబ సభ్యులు ఔట్ పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌ఛార్జి తేజ కోరారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఆకట్టుకుంటున్న బాస్కెట్ బాల్ కోర్టులు

కురబలకోట : స్థానిక అంగళ్లు సమీపంలోని విశ్వం కళాశాలలో గురువారం నుంచి ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్ చాంపియన్ షిప్–23 అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలిపింది. 13 జిల్లాల నుంచి 13 బాల బాలికల జట్లు పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. బాస్కెట్ బాల్ సంరంభం ప్రారంభం కానుండడంతో క్రీడాభిమానుల్లో సందడి నెలకొంది.

పది పరీక్షలకు తొలి ఘట్టం షురూ

- పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఈ నెల 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలని ఆదేశం
- అపరాధ రుసుంతో ఈ నెల 30వ తేదీ వరకు గడువు



పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కడప ఎడ్యుకేషన్ : పది పరీక్షల ప్రక్రియకు తొలి ఘట్టం షురూ అయ్యింది. వచ్చే ఏడాది మార్చి నెలలో నిర్వహించబోయే పది పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఎంత ఫీజు చెల్లించాలి.. ఏ గడువులోపు చెల్లించాలనే విషయాలతో ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లా వ్యాప్తంగా వచ్చే ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు సంబంధించిన 28 వేల మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. వీరంతా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించ వచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న రెగ్యులర్ అభ్యర్థులంతా ఈ నెల 10వ తేదీలోపు రూ.125 చొప్పున ఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కన్నా ఎక్కువ ఉంటే రూ.125, వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ పరీక్ష ఫీజు రూ.125తోపాటు అదనంగా మరో రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ వయసున్న విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు రూ.300 చెల్లించాలి. పూర్తిచేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలి.

అపరాధ రుసుముతో 30 వరకు..

పదో తరగతి పరీక్ష ఫీజును అపరాధ రుసుంతో ఈ నెల 30వ తేదీ వరకు చెల్లించేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. రూ.50 అపరాధ రుసుంతో నవంబర్ 16వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 22వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు.

రూ.125 కంటే ఎక్కువ అడగొద్దు



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024కు సంబంధించి విద్యార్థుల నుంచి రూ.125 మాత్రమే తీసుకోవాలి. అంతకంటే ఒక్క రుపాయి ఎక్కువ తీసుకున్నా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా కరస్పాండెంట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. కావున ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్ణయించిన రూ.125 ఫీజు మాత్రమే తీసుకోవాలి.

– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుట్టపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సల్మా, వీరనారాయణమ్మ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ రమణమ్మ తెలిపారు. ఒంగోలులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–17 సాఫ్ట్ బాల్ పోటీలలో సల్మా, వీరనారాయణమ్మ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. పీడీ జేసునాథరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో అన్యాయం



సంఘీభావం తెలియజేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం విషయంలో కేంద్రం చిన్న చూపు చూస్తోందని, విద్యార్థులు, యువకులు తిరుగుబాటు చేసి పరిశ్రమను సాధించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సింగరాజ్ అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించాలని కోరుతూ కడపలో బుధవారం విద్యా సంస్థల బంద్, నిరసన ర్యాలీలు చేపట్టారు. అనంతరం ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప అంటేనే కరవు ప్రాంతమని, యువకులు, విద్యార్థులు, బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారన్నారు. జమ్మలమడుగు వద్ద ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తయితే యువతకు ఇక్కడే ఉద్యోగాలు వస్తాయన్నారు. విశాఖ ఉక్కుకు దేశంలోనే ఉన్నతమైన ఆర్థిక ఫలితాలు వస్తున్నా.. ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వలరాజు, డీఎం.ఓబులేశు, షాకీర్, నాగేంద్ర, చైతన్య, శివశంకర్, అరుణ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేంపల్లె : మండలంలోని వేంపల్లెకు చెందిన లక్ష్మీదేవికి నాగూరులో పొలాలున్నాయి. బుధవారం ఉదయం పొలం పనుల కోసం నాగూరుకు వెళ్లారు. సాయంత్రం ఆమె తమ్ముడు శిరిగిరెడ్డి శివశంకర్‌రెడ్డి మోటార్ బైక్‌పై వేంపల్లెకు తిరిగి వస్తుండగా వెనుక వైపు నుంచి మరో బైక్ ఢీకొంది. లక్ష్మీదేవి, శంకర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలవడంతో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు కంపెనీలో ప్రమాదం

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో మైనింగ్ పనులు చేపట్టిన ఎస్‌ఎంఎస్ కంపెనీలో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్‌ఎంఎస్ కంపెనీలోని సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసేందుకు పులివెందుల నుంచి ప్రకాష్, అరుణ్ వెళ్లారు. సెప్టిక్ ట్యాంకులో దిగి శుభ్రం చేస్తుండగా ఊపిరాడకపోవడంతో స్పృహతప్పి పడిపోయారు. ట్యాంకులోకి వెళ్లిన వారిరువురూ ఎంతసేపటికీ రాకపోవడంతో అక్కడున్న వారు వెళ్లి చూడగా స్పృహతప్పి పడిపోయిన విషయాన్ని గమనించారు. వెంటనే వారిని పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

పొలతల దేవస్థానం అభివృద్ధికి కృషి



నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

పెండ్లిమర్రి : ఆధ్యాత్మిక క్షేత్రం పొలతల మల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, రాష్ట్ర ఆర్టీసీ ఛైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి తదితరులు హాజరయ్యారు. అతిథుల సమక్షంలో ముందుగా పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయ ఛైర్మన్‌గా అంబటి నాగమల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొలతల క్షేత్రానికి మంజూరైన రూ.14.50 కోట్ల టీటీడీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేష్ రామాంజుల రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పొలతల మాజీ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా నిధుల వినియోగం



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

రాయచోటి/టౌన్ : ప్రధానోపాధ్యాయులు నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమష్టి కృషితో సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే పాఠశాల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల నోట్స్ పరిశీలించి సంతకం చేశారా? సిలబస్ సకాలంలో పూర్తి చేశారా? అనే విషయాలను ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. సమయపాలన పాటిస్తూ ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో వంద శాతం హాజరు నమోదు చేయాలన్నారు. డ్రాపౌట్ లేకుండా చూడాలని, విధులపై నిర్లక్ష్యం చూపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, రామకృష్ణ, వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడల పోటీలు



దివ్యాంగుల క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో విభిన్న ప్రతిభావంతుల క్రీడల పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సంక్షేమశాఖ అధికారి కృష్ణ కిశోర్ జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ 3వ తేదీన ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం శాపం కారాదని, లోపాన్ని అధిగమించి విజయం వైపు సాగాలని సూచించారు. అనంతరం దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ క్రీడల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మిట్టా కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గండికోట జలపాతంలో విద్యార్థి గల్లంతు



ధనుష్ (ఫైల్)

జమ్మలమడుగు : గండికోట సమీపంలోని జలపాతం వద్ద ఈతకు వెళ్లిన విద్యార్థి బుధవారం గల్లంతయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని శ్రీనివాస నగర్‌కు చెందిన కె.ధనుష్(17) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్యాటక కేంద్రమైన గండికోట సమీపంలో జలపాతం చూసేందుకు వెళ్లారు. నీటిలో దిగి సరదాగా ఈత కొట్టాలనుకున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ధనుష్ జలపాతంలో దిగిన కొంతసేపటికే గల్లంతయ్యారు. స్నేహితులు ధనుష్‌ను కాపాడేందుకు ప్రయత్నించినా ఆచూకీ తెలియలేదు. విద్యార్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలిస్తున్నారు.

ఆపు బాబు నాటకం.. జగనే మా నమ్మకం




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు, చిత్రంలో జెడ్పీ ఛైర్మన్, తదితరులు

కడప కార్పొరేషన్ : ఆపు బాబు నీ నాటకం... జగనే మా నమ్మకం నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఎల్లో మీడియా కుట్రలు, కుతంత్రాలు వారు చేసే అభూత కల్పనల గూర్చి వివరించాలని వైస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు జయప్రదం చేయాలని కోరారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి మండల కార్యాలయాలు, సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులు ఆవిష్కరించడం, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం, గ్రామ పెద్దలు, తటస్థులతో డిన్నర్ ఏర్పాటు చేసి అక్కడే బస చేయడం వంటివి చేయాలన్నారు. మరుసటి రోజున ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ప్రచారం చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లక్షా 45వేల మందికి పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చామని, వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసి 50వేల ఖాళీలను భర్తీ చేశామని తెలుపాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్రం తలసరి ఆదాయంలో 17వ స్థానంలో ఉంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 9వ స్థానానికి చేరిందని తెలిపారు. 2019కి ముందు రాష్ట్రం 22వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం మూడో స్థానంలో ఉందన్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, శ్రీరంజన్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, ఆటో, స్మగ్లర్లతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లో ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు స్మగ్లర్లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు. వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలు, ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సిద్దవటం రేంజ్, చిలకలబండ రస్తా అటవీ ప్రాంతం తనిఖీ చేశామన్నారు. చిలకలబండ రస్తా వద్ద ఆటో గమనించి తనిఖీలు చేస్తుండగా, కొందరు ఎర్రచందనం స్మగ్లర్లు దుంగలు తెస్తూ కనిపించారన్నారు. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా అరూరుకు చెందిన హరిగళన్ చిన్నతంబి, వైఎస్‌ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం నాయనిపల్లికి చెందిన సర్దార్‌లను అదుపులోకి తీసుకుని 12 దుంగలు, ఆటో స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన మరో ఐదుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. పట్టుబడిన దుంగల విలువ రూ.1.63 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్ట్ బీట్ అధికారులు రాజశేఖరరెడ్డి, పెంచల్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

రాజంపేట : రాజంపేట ఏఐటీఎస్‌లో జేఎన్‌టీయూఏ అంతర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. ముందుగా ఈ పోటీలను ఏఐటీఎస్ ఈడీ చొప్పా ఎల్లారెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ జోజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి జోజిరెడ్డి, సభ్యుడు మారుతి, సెలెక్షన్ కమిటీ సభ్యులు డి.గోపీనాథ్, స్టేట్ రెఫరీ మహేష్, సద్దాం హుసేన్, ప్రిన్సిపల్ డా.నారాయణ, పీడీ నాగముని పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారితో రెండు జట్లను ఎన్నుకున్నారు.

మహిళా జట్టు : ఆర్.భార్గవి(కెఎస్‌ఆర్ కాలేజీ), జి.సాయిసంధ్య(ఎస్‌బీకేఆర్), సీహెచ్. అశ్వని(జీఐఎస్టీ), జి.గ్రాసీ (జేఎన్‌టీయూఏ ఏసీఏ), వందన(జెన్‌టీయుఎ ఏసీఈపీ), కె.కులసంభీ, మనీష(జీఆర్‌పీ ఈసీ), దివ్య (ఎన్‌బీకేఆర్), కె.శశికళ్యాణి(ఎంఆర్‌సీ), కె.భవిత(ఏఐటీఎస్) ఎంపికయ్యారు.

పురుషుల జట్టు : బి.హరి(ఏఐటీఎస్), కె.నారాయణరెడ్డి (ఎస్‌ఆర్‌ఈసీ), ఎం.పవన్ (సీబీఐటీ), ఉదయ్ కిరణ్(ఎస్‌ఆర్‌ఈసీ), బి.మనోహర్‌రెడ్డి (ఎన్‌బీకేఆర్), ఎం.పూర్ణఅశోక్, (జీఐఎస్టీ), జెడ్.సంతోష్(ఎస్‌ఆర్‌ఐటీ), ఎస్.భరత్ కుమార్‌రెడ్డి(ఎస్‌బీకేఆర్), అశోక్ కుమార్(ఆర్జీఎం), బి.జశ్వంత్‌రాయల్ (ఏఐటీఎస్)ఎంపికయ్యారు.

ఐదుగురికి గాయాలు

సంబేపల్లె : మండలంలోని మోటకట్ల సమీపంలో చిత్తూరు–కర్నూలు రహదారిపై రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మోటకట్ల సమీపంలో బుధవారంరాయచోటి నుంచి సంబేపల్లె వైపు వెళ్తున్న ఆటో సంబేపల్లె నుంచి రాయచోటి వైపు వెళ్తున్న ఆటోను ఢీకొంది. మోటకట్ల కాకలపల్లెకు చెందిన రమణమ్మ, మంగమ్మ, రాజు, పొత్తుకూరుపల్లె, మోటకట్ల గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్లు రెడ్డయ్య, వెంకటరమణలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళకు..

మదనపల్లె : వంట పనులు చేస్తున్న మహిళ విద్యుదాఘాతంతో గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కురబలకోట మండలం కంటేవారిపల్లెకు చెందిన నారాయణ భార్య రమణమ్మ (45) ఇంట్లో గ్రైండర్ ఆన్ చేయగా విద్యుత్తు షాక్ తగిలి గాయాలయ్యాయి.

బంగారం బురిడీలో పాత్రధారులెవరు?

- అప్రైజర్ చంద్రమోహన్ కోసం పోలీసుల గాలింపు
- తమ ప్రమేయం లేదంటున్న వినియోగదారులు



మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు

ప్రొద్దుటూరు క్రైం : నాణ్యత లేని బంగారు నగలు ఇతరుల పేర్లతో తాకట్టుపెట్టి కోట్లు దండుకున్న వ్యవహారంలో తీగ లాగితే డొంకంతా కదులుతోంది. ఈ ఉదంతంతో జిల్లాలోని ఇతర బ్యాంకర్లు అప్రమత్తమయ్యారు. లాకర్లలో ఉంచిన బంగారు నగలను పరిశీలించాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించడంతో ఈ వ్యవహారంపై చర్చ మొదలైంది. మరో వైపు బ్యాంకర్లను బురిడీ కొట్టించిన గోల్డ్ అప్రైజర్ పుల్లగూరు చంద్రమోహన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతడు పట్టుబడితే అసలు వ్యవహారం బయట పడనుంది. వైఎస్సార్ జిల్లా మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో తక్కువ నాణ్యత గల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి 39మంది బ్యాంకు ఖాతాదారులు రూ. 3.17 కోట్ల రుణం తీసుకున్న విషయం తెలిసిందే. పరిశీలించిన బ్యాంకర్లకు బంగారంలో నాణ్యత లేదని తెలియడంతో గోల్డ్ అప్రైజర్ పుల్లగూరు చంద్రమోహన్‌తోపాటు 39మంది ఖాతాదారులపై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసిన అధికారులు చంద్రమోహన్ కోసం మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో గాలిస్తున్నారు.

అప్రమత్తమైన బ్యాంకర్లు

ప్రొద్దుటూరులో వ్యాపార అవసరాల నిమిత్తం బంగారు నగలను ఎక్కువగా తనఖా పెడుతుంటారు. తక్కువ వడ్డీకి డబ్బు ఇవ్వడంతో రైతులు తమ నగలను తాకట్టు పెట్టి రుణం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పలు బ్యాంకుల్లో గోల్డ్ అప్రైజర్‌లు మోసం చేసిన ఘటనలు గతంలోనూ చోటు చేసుకున్నాయి. కొందరు బ్యాంకర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా మరింతమంది పోలీసుల గొడవ మనకెందుకులే అనుకుని నగలు రకవరీ చేయించుకొని వదిలేశారు. బాధ్యతగా ఉండాల్సిన గోల్డ్ అప్రైజర్లే మోసాలకు పాల్పడడతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇతరుల పేర్లతో తాకట్టు

మూడున్నరేళ్ల కిందట గోల్డ్ అప్రైజర్ చంద్రమోహన్ ఇతరుల పేరుతో బంగారు నగలను తాకట్టు పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు, మూడు సార్లు బంగారంపై తీసుకున్న రుణాల ఖాతాలను రెన్యువల్ చేసినట్లు సమాచారం. సాధారణ తనిఖీల్లో భాగంగా అధికారులు బంగారు నగలను పరిశీలించడంతో ఈ విషయం బయటపడింది. మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్‌లోనూ ఇదే జరిగింది. నాణ్యత లేని బంగారు నగలు తాకట్టు పెట్టి రూ. 3.17 కోట్లు రుణం తీసుకున్న వ్యవహారం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఖాతాదారులు మాత్రం తమతో ఉన్న పరిచయాల కారణంగా గోల్డ్ అప్రైజర్ చంద్రమోహన్ తమ పేరిట రుణం తీసుకున్నట్లు వాపోతున్నారు. తన పిల్లల చదువుకు డబ్బు అవసరముందని, తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చంద్రమోహన్ చెప్పడంతో రుణం తీసుకునేందుకు అంగీకరించామని చెప్పారు. పోలీసులు తమపై కేసు నమోదు చేశారని, ఈ విషయాన్ని పోలీసులు, బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.